క్లుప్తంగా

కన్నబాబుకు అదీప్‌రాజ్ అభినందన



కురసాల కన్నబాబును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన మాజీ మంత్రి కురసాల కన్నబాబును మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అభినందించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం కలిసి దుశ్శాలువ కప్పి, పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జోబ్‌దాస్(చిన్ని) తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

ఆదిత్యునికి అభిషేకాలు



పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: మాఘ మాసోత్సవాల్లో భాగంగా సుజాత నగర్లోని సూర్య నారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జామున స్వామి వారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


వరాహ పుష్కరిణి వద్ద వ్యర్థాల తొలగింపు



వరాహ పుష్కరిణి వద్ద వ్యర్థాలు తొలగిస్తున్న సంత్ నిరంకారీ సభ్యులు

సింహాచలం: సంత్ నిరంకారీ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థాన వరాహ పుష్కరిణి వద్ద వ్యర్థాలను తొలగించారు. ప్రాజెక్ట్ అమృత్, స్వచ్ఛ జలం–స్వచ్ఛ మనసు నినాదంతో సుమారు 200 మంది సేవాదళ సభ్యులు, వలంటీర్లు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సేవాదళ్ క్షేత్రీయ సంచాలకుడు డీఏఆర్ రవి మాట్లాడుతూ సద్గురు బాబా హరదేవ్‌సింగ్ మహారాజా జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఏటా ఫిబ్రవరి 23న క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈసారి సుమారు 15 వేల ప్రదేశాల్లో క్లీనింగ్ కార్యక్రమం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ ప్రతినిధులు రాజ్‌వీర్, జి.రాము తదితరులు పాల్గొన్నారు.

పశు సంవర్థక శాఖాధికారుల సంఘ జేఎస్‌గా రామకృష్ణకీర్తి



డాక్టర్ రామకృష్ణ కీర్తి

పరవాడ: ఏపీ పశు సంవర్థక శాఖాధికారుల సంఘ సంయుక్త కార్యదర్శిగా పరవాడ పశు సంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ కీర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని లబ్బీపేటలో ఇటీవల జరిగిన సంఘ ఎన్నికల్లో తనను ఎన్నుకున్నట్లు ఆయన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పశుసంవర్ధకశాఖాధికారుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

ప్రమాదకరం.. మధ్య రోడ్డులో ప్రయాణం

హనుమంతవాక నుంచి అడవివరం వైపు వెళ్లే బీఆర్‌టీఎస్ మధ్యరోడ్డు.. కేవలం ఆర్టీసీ బస్సులకే పరిమితమైన ఈ రోడ్డులో ఇతర వాహనదారులు యథేచ్ఛగా, అతి వేగంగా రాకపోకలు సాగిస్తున్నారు. సర్వీస్ రోడ్లలో ప్రయాణం సాగించాలన్న విషయాన్నే మర్చిపోతున్నారు. ద్విచక్ర వాహనదార్ల నుంచి హెవీ వెహికల్స్ వరకు అన్నీ మధ్య రోడ్డులోనే సాగుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు, ఇబ్బందులు చోటు చేసుకుంటున్నాయి.

- బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో యథేచ్ఛగా వాహనాల రాకపోకలు
- సింహగిరికి వెళ్లే రెండో టోల్‌గేట్ వద్ద అంతా గందరగోళం
- ట్రాఫిక్ పోలీసుల నిఘా అంతంతమాత్రమే



బీఆర్‌టీఎస్ మధ్యరోడ్డులో నిషేధిత వాహనాల రాకపోకలు



సింహాచలం 2వ టోల్‌గేట్‌కు సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న వాహనాలు



సర్వీస్ రోడ్డులో కూరుకుపోయిన స్పీడ్ బ్రేకర్

సింహాచలం: అటు గోపాలపట్నం, ఇటు కొత్తవలస, పెందుర్తి పరిసర ప్రాంతాల నుంచి ఎంతో మంది నగరంలోకి బీఆర్‌టీఎస్ రోడ్డు మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. సింహాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు నగరం నుంచి వచ్చే భక్తులు ఇదే మార్గంలో కొండపైకి చేరుకుంటారు. రోజూ వేలాది వాహనాలు ఈ మార్గంలోనే వెళ్తున్నాయి. సర్వీస్ రోడ్లలో మాత్రమే వెళ్లాల్సిన వాహనాలు కూడా మధ్య రోడ్డులో యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. స్పీడ్ లిమిట్ 40కి మించరాదన్న హెచ్చరిక బోర్డులను సైతం పట్టించుకోవడం లేదు. పలువురు ఆటో డ్రైవర్లు కూడా మధ్య రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుండటంతో సింహాచలం ఘాట్ రోడ్డు సమీపంలో తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

2వ ఘాట్‌రోడ్డు దిగాక గందరగోళం

ఈ మార్గంలో అడవివరం కూడలి దాటాక.. సింహగిరి రెండవ ఘాట్‌రోడ్డులో నుంచి దిగువకి వచ్చే వాహనదారులు భయభ్రాంతులు చెందుతున్నారు. ఘాట్‌రోడ్డు దిగిన తర్వాత వాహనదారులు హనుమంతవాకవైపు వెళ్లాలంటే ఎడమవైపు ఉన్న సర్వీసు రోడ్డులో కొంతదూరం ప్రయాణించి కుడివైపు ఉన్న సర్వీసు రోడ్డులోకి యూటర్న్ తీసుకోవాలి. ఆ సమయంలో బీఆర్‌టీఎస్ మధ్యరోడ్డులో నుంచి వాహనాలు అతి వేగంతో దూసుకొస్తున్నాయి. దీంతో ఘాట్ రోడ్డు దిగే వాహనాదారులు బెంబేలెత్తుతున్నారు.

శొంఠ్యాం నుంచి రాంగ్ రూట్లో..

మరోవైపు శొంఠ్యాం మార్గంలో వచ్చే వాహనదారులు రెండవ ఘాట్‌రోడ్డులో సింహగిరికి వెళ్లాలంటే గగనంగా మారుతోంది. రాంగ్ రూట్లో వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ సమయంలో ఎదురుగా సర్వీస్ రోడ్డు/మధ్య రోడ్డు మీదుగా వేగంగా వచ్చే వాహనాలతో బెంబేలెత్తుతున్నారు. ఇక సర్వీస్ రోడ్లలో స్పీడ్ బ్రేకర్లు సరిగా లేకపోవడంతో ఎక్కడా వాహనదారులు వేగం తగ్గట్లేదు. రయ్‌మంటూ దూసుకొస్తున్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీస్ నియంత్రణ కేంద్రం ఉన్నా ఎన్నడూ దాన్ని వినియాగంలోకి తీసుకు వచ్చిన దాఖలాల్లేవు. అక్కడ సిబ్బంది ఎప్పుడూ విధులు నిర్వర్తించలేదన్న ఆరోపణలున్నాయి.



అలంకారప్రాయంగా ట్రాఫిక్ నియంత్రణ కేంద్రం, స్పీడ్ లిమిట్ బోర్డు

ఇలా చేస్తే కాస్త మేలు..

- బీఆర్‌టీఎస్ మధ్య మార్గంలో సాధారణ వాహనాలు ప్రయాణించరాదని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- సింహాచలం రెండవ టోల్‌గేట్ వద్ద యూటర్న్ తీసుకునేందుకు వీలుగా మధ్య రోడ్డులో భారీ స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలి.
- సర్వీస్ రోడ్డులో కుదించుకుపోయిన స్పీడ్ బ్రేకర్ల స్థానంలో కొత్తగా కాస్త ఎత్తైన స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.
- పోలీస్ సిబ్బంది ఈ మార్గంలో ఎప్పటికప్పుడు గస్తీ కాయాలి. మధ్యరోడ్డులో ప్రయాణించే వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలి.
- టోల్‌గేట్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నియంత్రణ కేంద్రంలో సిబ్బంది విధుల్లో ఉండేలా చూడాలి.

ట్రాఫిక్ పోలీస్ నిఘా అవసరం



నేను ప్రతీరోజూ సాయంత్రం బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డు పక్క నుంచే వాకింగ్‌కి వెళ్తుంటాను. నా కళ్లెదుటే మధ్య రోడ్డులో ఎన్నో వాహనాలు స్పీడుగా వెళ్తున్న సంఘటనలు చూస్తున్నాను. మితిమీరిన వేగంతో వాహనాలు వెళ్తుండటం చూస్తుంటే భయం వేస్తోంది. ఈ మార్గంలో ట్రిఫిక్ పోలీస్ నిఘా ఎంతో అవసరం.

– కె.రమణమూర్తి, రిటైర్డ్ ఉద్యోగి, అడవివరం

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



రోజూ సింహాచలం రెండవ టోల్‌గేట్ సమీపంలో ఉన్న ఓపెన్ జిమ్‌కి వచ్చి వ్యాయామం చేస్తుంటాను. హనుమంతవాక వైపు నుంచి సర్వీసు రోడ్డు, మధ్య రోడ్డులో వాహనాలు విపరీతమైన వేగంతో రాకపోకలు సాగిస్తుండటం చూస్తున్నాను. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పక్కాగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– ప్రవీణ్, విద్యార్థి, పైనాపిల్ కాలనీ

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత నూకాలు సూర్యకాంతానికి బాండ్ అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శ్రీకాకుళానికి చెందిన నూకాలు సూర్యకాంతం రూ.లక్ష 1,116 విరాళాన్ని నగదు రూపంలో ఆదివారం అందించారు. దేవస్థానం తరపున ప్రొటోకాల్ ఏఈవో రాంబాబు దాతకు బాండ్ ఇచ్చారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందించారు. ప్రొటోకాల్ జూనియర్ అసిస్టెంట్ రౌతు వరాహనరసింహం పాల్గొన్నారు.

రక్షణ గోడల్లేని కల్వర్టుతో భయం భయం



పరవాడ రహదారిలో రక్షణ గోడలు లేని కల్వర్టు

పరవాడ: స్థానిక వెలుగు కార్యాలయం సమీపంలో ఉన్న కల్వర్టు ప్రయాణికులను భయపెడుతోంది. పరవాడ–గాజువాక రహదారిలో కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన కల్వర్టు రక్షణ గోడలు శిథిలమై కూలిపోయాయి. అనంతరం వాటిని ఏర్పాటు చేయడానికి ఆర్ అండ్ బీ అధికారులు కనీస చర్యలు చేపట్టలేదు. రహదారికి అతి సమీపంలో గల ఈ కల్వర్టు పైనుంచి నిత్యం ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ముందే రహదారిలో వీధి దీపాలు అంతంత మాత్రంగా వెలుగుతున్నాయి. చీకటి పడితే రక్షణ గోడలు లేని కల్వర్టుతో ప్రయాణికులు బితుకు బితుకుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. వాహనాలపై జాగ్రత్తగా రాకపోకలు సాగించకపోతే అదుపు తప్పి కల్వర్టులో పడడం ఖాయం. కల్వర్టుపై రక్షణ గోడలను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైభవంగా బంగారమ్మతల్లి పరస



బంగారమ్మతల్లి



అమ్మవారి సన్నిధిలో భక్తులు

సింహాచలం: అడవివరం గ్రామదేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి బంగారమ్మతల్లి తీర్థ మహోత్సవం(పరస) ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి చీరలు, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు సింహాచలం దేవస్థానం పులిహోర ప్రసాదాన్ని అందించింది. ఆలయానికి విద్యుద్దీపాలంకరణ చేసింది. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. స్థానికులు తోట చంద్రరావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్న సమారాధన, సాయత్రం లడ్డూ ప్రసాద వితరణ చేశారు. గ్రామస్తులు విశేషంగా తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. బంగారుతల్లి యూత్ ఫ్రెండ్స్ అక్రమంతి ప్రసాద్, తోట రజని, శ్రీధర్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



వడ్డన చేస్తున్న బంగారుతల్లి యూత్ ఫ్రెండ్స్

వీరాంజనేయ ఆలయ ప్రారంభోత్సవం



నూతనంగా ప్రారంభించిన వీరాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తుల సందడి



స్వామిని దర్శించుకుంటున్న గుడివాడ అమర్‌నాథ్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురం శివారు గ్రామంలో వీరాంజనేయస్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేద పండితులు మంత్రోచ్ఛరణలతో స్వామివారి కలశ ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, వీరాంజనేయస్వామి యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రారంభోత్సవంలో మాజీ ప్రభుత్వ విప్, పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వీకేపీసీపీఐఆర్ మాజీ చైర్మన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు పూజలు జరిపారు. స్వామిని దర్శించుకున్నవారిలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నాయకులు సబ్బవరం ఎంపీపీ బోకం సూర్యకుమారి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరాం, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మండల కన్వీనర్ కర్రి బాబు, విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్, నాయుకులు బోను గంగు నాయుడు, యడ్ల నాయుడు, రాయవరపు పైడిరాజు, సిరపరపు వాసు, ఐడీ బాబు తదితరులు ఉన్నారు.

ఉన్నత శిఖరాలే యువత లక్ష్యం

ఏయూక్యాంపస్: ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా యువత కృషి చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. డివైన్ టచ్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం పిల్లల కోసం నిర్వహించిన వాక్‌థాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో గొప్ప విజయాలను సాధించడానికి వేకువజామునే మేల్కొనడం, వ్యాయామం చేయడం ఎంతగానో దోహదపడతాయన్నారు. చిన్నతనం నుంచి క్రమశిక్షణ, మంచి అలవాట్లను కలిగి ఉండాలని సూచించారు. మన ప్రవర్తన భవిష్యత్ జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నితాయి సేవినీ మాతాజీ మాట్లాడుతూ కృతజ్ఞతా వాక్‌గా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పిల్లలకు మానసిక ఉల్లాసాన్ని కలిగించే ఆహ్లాదకర వాతావరణాన్ని పరిచయం చేశామన్నారు. ఉదయాన్నే ప్రశాంత వాతావరణం, బంగారు రంగు ఇసుక తిన్నెలు వంటి వన్నీ శ్రీకృష్ణుడు మన కోసం సృష్టించినవేనన్నారు. శ్రీకృష్ణుడికి కృతజ్ఞతా భావం ప్రతీ వ్యక్తి అలవరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాళీ ఆలయం నుంచి సబ్‌మెరైన్ వరకు ఈ నడక సాగింది.



వాక్‌థాన్‌లో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

ఘనంగా సీతారాముల తీర్థం

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీ రామాలయం, ఉపాలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు, సింహపురికాలనీ నివాసితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సందడి చేశారు. ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అంధుల ఆర్కెస్ట్రా విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవలోని శ్రీకంచి శక్తి పీఠం, స్వయంభూ శనేశ్వర పుణ్యక్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలకు విశేష ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఐదడుగుల స్ఫటిక లింగేశ్వరస్వామికి సహస్ర కలశాభిషేకం జరిపించనున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొవాలని నిర్వాహకులు కోరారు.

కేంద్ర మంత్రి దృష్టికి భెల్ ఉద్యోగుల సమస్యలు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ నాయకులు ఆదివారం నగరంలోని సర్క్యూట్ హౌస్‌లో కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మను కలిశారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పీఎఫ్ , ఉద్యోగుల సర్వీసు 1992కు బదులు 1997గా నమోదైందని, అలాగే కొంత మంది కార్మికులకు 2011 సంవత్సరంగా నమోదైందని.. వాటిని సవరించాలని మంత్రిని కోరారు. ఇలాంటి దొర్లడంతో పలువురు కార్మిక, ఉద్యోగులు భవిష్యత్తులో చాలా నష్టపోయే పరిస్థితి ఎదురవుతుందని మంత్రికి వివరించారు. ఈ సమస్యపై భెల్ యాజమాన్యంతో పాటు, పీఎఫ్ యాజమాన్యంతో పలు దఫాలుగా చర్చలు జరిపినా సమస్య పరిష్కారం కాలేదని విన్నవించారు. 95 హయ్యర్ పెన్షన్ అందరికీ రిజక్ట్ అయిందని, దీనిపై సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ నాయకులు బొండా బాబూరావు, సుభాకర్ సాహూ, పి.వి.ఎస్.రాజు, కొల్లి దేముడు, పి.భాస్కరరావు, బి.రవీంద్ర,ఎ.వెంకట్రావు, అనకాపల్లి శ్రీను, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఛిద్రమైన రోడ్డుతో వాహనదారుల పాట్లు



మరమ్మతులు చేపట్టిన మూడు నెలల్లోనే ధ్వంసమైన సబ్‌స్టేషన్ కూడలి రోడ్డు

పరవాడ: స్థానిక సబ్‌స్టేషన్ కూడలి రోడ్డు అధ్వానంగా మారడంతో రహదారి ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఈ కూడలి మీదుగా గాజువాక, అనకాపల్లి, యలమంచిలి ప్రాంతాలకు విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులతో పాటు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అచ్యుతాపురంలోని ఎస్‌ఈజెడ్, పరవాడలోని ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమలకు బొగ్గు, యంత్ర సామగ్రిని తరలించే భారీ వాహనాలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. బరువైన బొగ్గు లారీల రాకపోకల కారణంగా రహదారులు ధ్వంసం అవుతున్నాయని గ్రామీణ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఎన్టీపీసీ యాష్ లారీలు కూడా ఈ కూడలి మీదుగానే ప్రయాణిస్తున్నాయి. దీంతో రహదారులు అధ్వానంగా మారి ప్రయాణికులను ప్రమాదాలకు గురిచేస్తున్నాయని వాపోతున్నారు. అధ్వానంగా మారిన సబ్‌స్టేషన్ కూడలి రోడ్డుకు మరమ్మతులు చేసి, మూడు నెలలు గడవక ముందే మళ్లీ రోడ్డులో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఫలితంగా ప్రయాణికులు తరచూ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. గోతులమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్లతో జిల్లా ఉద్యాన అధికారి ప్రభాకరరావు

సబ్బవరం: ఉద్యాన పంటలైన మామిడి, జీడిమామిడి తోటల్లో పూత దశలో తగిన యాజమాన్య పద్ధతులను పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని సబ్బవరం జాగృతి సంస్థ కార్యాలయంలో సబ్బవరం, కోటపాడు, దేవరాపల్లి మండల రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్లతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా అందించే పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి, వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఆయా మండలాల్లోని రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులు సాగు చేస్తున్న టమాటా విస్తీర్ణం, మార్కెటింగ్‌పై రైతులు ఎదుర్కొనే సమస్యలు, రేట్లపై చర్చించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి కిరణ్మయి పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించండి

ఏయూక్యాంపస్: ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పాటైన విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పూర్తిస్థాయిలో కృషి చేయాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మను ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. ఆదివారం విశాఖలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయడం స్వాగతిస్తున్నామని, అదే సమయంలో కేకే లైన్‌తో కూడిన పూర్తిస్థాయి దక్షిణకోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి నాయకులు పెదిరెడ్ల సత్యం, చల్లా సురేష్, పెదిరెడ్ల శ్రీనివాస్, రెడ్డి ఈశ్వరరావు, వరుదు రాజ్‌కుమార్, బర్ల పైడంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా ఉంటా



కొలిపాక అప్పారావును సత్కరిస్తున్న చేనేత సంఘాల నాయకులు

అగనంపూడి: చేనేత కార్మికులు, కుటుంబాలకు తన పరిధిలో సహాయ సహకారాలు అందిస్తానని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు కొలిపాక అప్పారావు అన్నారు. అప్పారావు చేనేత విభాగం అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా పెదమడకలో ఆయన్ను ఆదివారం చేనేత సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పుట్టా శ్రీనివాసరావు, స్వర్ణపూడి ఈశ్వరరావు, మొండి సత్యనారాయణ, దొడ్డి దేముడు, గంధోళి పైడికొండ, బేతా ప్రసాద్, పొన్నగంటి నాగేశ్వరరావు, బొమ్మన రాముర్తి, దూడక రమేష్, పిల్లి శంకరరావు, గోవిందరావు, గంధోళి రామారావు పాల్గొన్నారు.